క్లుప్తంగా

కుంటాలలో భారీ వర్షం



కుంటాలలో జలమయమైన రోడ్డు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని తొమ్మిదో వార్డులో మురికి కాలువలో చెత్త పేరుకుపోవడంతో రోడ్డంతా జలమయమైంది. అరగంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కురవడంతో వ్యవసాయ పనులు కొనసాగలేదు

కూలిన ఇల్లు పరిశీలన

సారంగాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కౌట్ల(బి) గ్రామంలోని శాంతినగర్‌కు చెందిన బాలాజీ ఇంటి గోడ కూలిపోయింది. గురువారం ఎంఆర్‌ఐ వెంకటనర్సయ్య గ్రామానికి వచ్చి కూలిన ఇంటిని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి పరిహారం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నా యకులు శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

తానూరు ఎస్సైగా షేక్ జుబేర్



తానూరు: తానూరు ఎస్సైగా షేక్ జుబేర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో భైంసా పట్టణంలో ట్రెయినీ ఎస్సైగా విధులు నిర్వర్తించి.. పూర్తిస్థాయి ఎస్సైగా తానూరుకు నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన ట్రెయినీ ఎస్సై నవనీత్ రెడ్డి భైంసాటౌన్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైకి పలువురు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాంచంద్రరావును సన్మానిస్తున్న రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావును జిల్లా నాయకులు కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, కట్టి శ్రీనివాస్ రావు తదితరులు ఆయనను సన్మానించారు.

ప్యాడిక్లీనర్ల తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

కుంటాల: మండలంలోని అందకూర్, కుంటాల, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ప్యాడి క్లీనర్లు వర్షానికి దెబ్బతింటున్నాయి. దీనిపై ఈనెల 3న సాక్షిలో ప్యాడిక్లీనర్లపై నిర్లక్ష్యమెందుకు..? శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురువారం ప్యాడి క్లీనర్లను ప్రత్యేక వాహనంలో సారంగపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సోన్: జిల్లాకేంద్రంలోని సోఫినగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో ఆర్థికశాస్త్రం బోధించుటకు సంబంధిత విభాగం పీజీలో 55 శాతం మార్కులతోపాటు పీహెచ్‌డీ/నెట్/సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని గురువారం ప్రిన్సిపల్ డి.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. తమ పూర్తి వివరాలతో పాటు, జిరాక్స్ ధ్రువపత్రాలతో కళాశాలలో ఈనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 79956 60879 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. ఒకరికి స్వల్ప గాయాలు



కాలువలో కారు

కుంటాల: మండలంలోని అందకూర్ చెరువు కట్ట సమీపంలోని కాలువలోకి ఓ కారు ప్రమాదవశాత్తు దూసుకెళ్లింది. గురువారం నర్సాపూర్ (జి) మండలం గొల్లమాడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ భైంసా వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కారులో ముగ్గురు ప్రయాణిస్తుండగా లక్ష్మణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అక్కడికి చేరుకొని కారులో ఉన్న వారిని బయటకు తీశారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల:మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. మధ్యాహ్న హారతి సమయంలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మల్చింగ్ సాగుపై ఆసక్తి

- కలుపు తక్కువ.. దిగుబడి ఎక్కువ
- ఏటా పెరుగుతున్న పంటల విస్తీర్ణం
- ప్రభుత్వ రాయితీతో ప్రోత్సాహం



మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాటా పంట

లోకేశ్వరం: ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఒకటైన మల్చింగ్ విధానంలో పంటల సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మల్చింగ్ కవర్ కప్పి ఉంచడం వలన భూమిలో తేమశాతం నిలిపి పంటలో కలుపు నివారణకు ఇదెంతో ఉపయోగపడుతోంది. ఉద్యానవన అధికారుల సూచనలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

ప్రయోజనాలు..

మొక్కల చుట్టూ నేలను ఏదైనా పదార్థంతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. మల్చింగ్ సాగులో మొక్క మొదటి భాగంలో సూర్యరశ్మి పడకుండా ఉండి భూమి లోపల తేమశాతం తగ్గదు. మొక్కలకు తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ,క్రిమికీటకాలు సోకకుండా మల్చింగ్ కవర్ కాపాడుతుంది. ఈ కవర్ కారణంగా నీటి వినియోగం, కలుపు మొక్కలు తగ్గి పంట దిగుబడి పెరుగుతుంది.

ఉపయోగించే విధానం..

ఉద్యానవన అధికారుల సూచనల మేరకు మార్కెట్‌లో లభించే మల్చింగ్ కవర్లను ఎంచుకోవాలి. ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేస్తారో అందుకు తగ్గటుగా సాళ్ల పొడవును బట్టి అంచనా వేసుకోవాలి. పంట చేనులో మొదట బెడ్(ఎత్తైన గట్ల పద్ధతి) తయారు చేసుకోవాలి. సాళ్లపై మల్చింగ్ కవర్ పరిచి అంచులను మట్టితో కప్పాలి. తర్వాత మొక్క, విత్తనం ఉన్న చోట పైపులతో రంధ్రాలు చేసుకోవాలి. డ్రిప్ ద్వారా నీటిని అందించి నేలను తడిగా ఉంచుకోవాలి. తర్వాత కొద్దిగా పెరిగిన తర్వాత కాండాన్ని రంధ్రం చేసి లాగాలి. కవర్ ఉండడం వల్ల కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉండదు.

రాయితీ పొందడం ఇలా ..

మల్చింగ్ సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఏటా జూన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుంది. హెక్టార్ సాగును ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. మొత్తం యూనిట్ విలువ రూ.40 వేలు. ఈ రూ.40వేలతో ముందుగానే కొనుగోలు చేసిన కవర్‌ను రైతు వ్యవసాయ క్షేత్రంలో నేలపై పరవాలి. ఉద్యానశాఖ అధికారులు వచ్చి సర్వేనంబరు తనిఖీ చేసి ఫొటో వివరాలు సేకరిస్తారు. అనంతరం బిల్లు, పాస్ ఫొటో, ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకాలు, బ్యాంకు ఖాతాల జిరాక్స్‌లను సమర్పించాలి. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో ఉద్యానశాఖ కమిషనర్ నుంచి రూ.20వేలు రాయితీ విడుదలై నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమవుతాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో 14 మంది రైతులు మల్చింగ్ సాగుకు దరఖాస్తు చేసుకోగా 11 యూనిట్లకు రాయితీ మంజూరైనట్లు అధికారులు పేర్కొన్నారు.

కలుపు బెడద తగ్గుతుంది



నాకున్న 12 ఎకరాల్లో నుంచి రెండున్నర ఎకరాల్లో మల్చింగ్ విధానంలో ఖర్బూజ పంట సాగు చేశా. దీంతో మొక్కలకు తక్కువ నీరు అవసరమవుతోంది. కలుపు కూడా తగ్గుతుంది. దీంతో చేనులో మొక్కలు ఏపుగా పెరిగి మంచి ఆదాయం వస్తుంది.

– కృష్ణారెడ్డి, రైతు, భాగపూర్

దరఖాస్తు చేసుకోవాలి



మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. ఆసక్తి కల్గిన రైతులు సమీపంలోని ఉద్యానవన అధికారులను సంప్రదించాలి. పంటలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన తర్వాత రాయితీ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది.

– డీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి

మొక్కలు నాటి సంరక్షించాలి



లోకేశ్వరం: మొక్కలు నాటిస్తున్న ఎంపీడీవో



సారంగపూర్ : అడెల్లి ఆలయ పరిసరాల వద్ద..



కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

సారంగపూర్: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ పరిసరాల్లో ఆలయ కమిటీ చైర్మన్ సింగం భోజాగౌడ్ సిబ్బందితో కలిసి ఖాళీ ప్రదేశాల్లో పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుభీర్:మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ సునీల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అధ్యాపకులు సంపత్, రమేశ్, భాస్కర్, శివరాజ్, మాధవి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండలంలోని బాగాపూర్–లోకేశ్వరం వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గతంలో నాటిన మొక్కలను నీరందించి.. వాటి నడుమ పెరుగుతున్న పిచ్చిమొక్కలను తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సోలమాన్ రాజ్, టీఏ రవీందర్, కార్యదర్శులు ఉన్నారు.

బాసర: మండలకేంద్రంలోని అమ్మవారి ఆలయం, రైల్వేస్టేషన్ పరిసరాల్లో గురువారం శ్రీ జ్ఞాన సరస్వతి ఆటో యూనియన్ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మొక్కలు నాటారు. ఆ సంఘం అధ్యక్షుడు గురప్ప శంకర్, మాజీ అధ్యక్షుడు మురికి సురేశ్ చిల్ల రవి, వాజిత్, చాంద్‌బాయ్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి జీవరత్నం

ఖానాపూర్: ప్లాస్టిక్ నిర్మూలన మనందరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. గురువారం మండలంలోని సుర్జాపూర్, మస్కాపూర్ గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలన, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం అనర్థాలను వివరించా రు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు గోడలపంప్పు గ్రామంలో ఎంపీవో రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో ప్రజలకు ప్లాస్టిక్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించి పంచాయతీ రికార్డులు, సెగ్రిగేషన్‌షెడ్డు పరిశీలించారు. ఎంపీడీవో సునీత, సింగం తిరుపతి, ఆరె గంగాధర్, గంగరాజం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్లపై కేజీవీల్స్ నడపొద్దు

లోకేశ్వరం: తారురోడ్లపై కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ అన్నారు. గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్‌లో ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లే ట్రాలీని ఎస్సై ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు ఉన్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు

ముధోల్: మండలకేంద్రంలో అనుమతి లేని నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి అన్వర్ అలీ అన్నారు. గురువారం ముధోల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిర్మాణాలు చేపట్టేవారు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే తమ సిబ్బంది వార్డుల వారీగా అనుమతి లేని నిర్మాణాలను గుర్తించి జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీకి విధిగా ఇంటి పన్నులు చెల్లించాలని ప్రజలకు సూచించారు.

పర్యావరణాన్ని రక్షించండి

ముధోల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యాపీఠం తెలంగాణ ప్రాంత పర్యావరణ ప్రముఖ్ విద్యాసాగర్ అన్నారు. గురువారం ముధోల్ శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు సారథిరాజు, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్నశర్మ, ఆచార్యులు పాల్గొన్నారు.

నియామకం

ఖానాపూర్: భజరంగ్‌దళ్ ప్రఖండ పరిధిలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఇద్దరు బాధ్యులు నియమితులయ్యారని భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ తెలిపారు. భజరంగ్‌దళ్ ప్రఖండ సహసంయోజక్‌గా పచ్చిమట్ల శివకుమార్‌గౌడ్‌తోపాటు ప్రఖండ గోరక్షక్ ప్రముఖ్‌గా తాళ్ల భూమేశ్ నియమితులైనట్లు పేర్కొన్నారు.

అడెల్లిలో తాతాయి పండుగ

సారంగాపూర్: మండలంలోని అడెల్లి గ్రామంలో తాతాయి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుమ్మరులు మట్టితో తయారు చేసిన తాతాయి విగ్రహ ప్రతిమలతో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహిస్తూ తాతాయి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సారంగపూర్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లీడ్ బ్యాంకు మేనేజరు రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పొదుపు, ఖర్చులు తెలుసుకోవాలన్నారు. సంపాదనకు మించి ఖర్చు చేస్తే అప్పులే మిగులుతాయని గుర్తు చేశారు. సైబర్ మోసాల బారిన పడకుండా తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెప్పాలన్నారు. బ్యాంకింగ్ సేవలు, సిబిల్ స్కోరుపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నా రు. హెచ్‌ఎం విజయ, మిషన్ సాథీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సబిత, మౌనిక, ఉపాధ్యాయులు రమేశ్‌గౌడ్, రాజేశ్, విద్యార్థులు ఉన్నారు.

నూతన ఎంఈవోకు సన్మానం

ఖానాపూర్: పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో నూతన ఎంఈవో బి. సంధ్యారాణిని గురువారం ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎంఏ గఫార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎంఈవోకు వివరించారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్, రాజేశ్వర్, ప్రకాశ్, సుభాశ్, అరుణ, సరిత, వసంత్ ఉన్నారు.

ఐకేపీ కార్యాలయంలో ఆడిట్

ఖానాపూర్: పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఇంటర్నల్(అంతర్గత) ఆడిట్ నిర్వహించారు. సీబీవో ఆడిటర్లు ముత్యం, పోశెట్టి ఆధ్వర్యంలో అర్ధసంవత్సరం ఆడిట్ చేపట్టారు. తరుణి మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన వివరాల రికార్డులను ఆడిట్ అధికారులకు ఐకేపీ ఏపీఎం భోజన్న, సిబ్బంది అందజేశారు. ఐకేపీ సీసీలు తునికి రాజేందర్, గుగ్లావత్ భీకసింగ్, కొడిమ్యాల విష్ణు, ఉప్పాల రమేశ్, శ్యామల తదితరులు ఉన్నారు.


ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

కుంటాల: రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని తహసీల్దార్ కమల్‌సింగ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణాల్లో స్టాక్ నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఏవో విక్రమ్, ఏఈవో హర్షిత తదితరులున్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

ముధోల్: విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఎస్సై బిట్లా పెర్సిస్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ఇటీవల ముధోల్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి గురువారం ఎస్సై ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యదాస్, ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ అమీర్‌కుస్రు, పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇస్తరి, వసంతరావు, పాండు తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలం గుర్తించాలని వినతి



కలెక్టరేట్ వద్ద జేఏసీ నాయకులు

ఖానాపూర్: పట్టణంలో 110 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి మిగులు భూమి వివరాలు అందజేయాలని కోరుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి నాయకులు గురువారం నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష్ అభినవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ అధికారులు సర్వే చేయకుండానే ఖానాపూర్‌లో స్థలం లేదని ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం ఇవ్వడంతోనే స్కూల్ ఉట్నూర్ వెళ్లే పరిస్థితి నెలకొందని తెలిపారు. జేఏసీ కన్వీనర్ నంది రామయ్య, నాయకులు ఆకుల శ్రీనివాస్, బీసీ రాజన్న, ఎనగందుల నారాయణ, రాజు, సుమిత్, మహేందర్, రవీందర్, ఉపేందర్, శ్రావణ్, బాబన్న, రవితేజ, తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బక్కన్న, నాయకులు

దిలావర్‌పూర్: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గురువారం మండలకేంద్రంలోని బీడీ ఫ్యాక్టరీ ఎదుట సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కో =రారు. నెలకు కనీస వేతనం రూ.26వేలు అందించి బీమా, సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.వేల కోట్లను రాయితీగా ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇందులో టీయూసీఐ జిల్లా కార్యదర్శి రామ్‌లక్ష్మణ్, నాయకులు నారాయణ, శంకర్, శివాజీ, లక్ష్మి, సరస్వతి, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులు కనిపిస్తే సమాచారమివ్వాలి



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

నిర్మల్‌రూరల్: గ్రామాల్లో అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ సీఐ కృష్ణ అన్నారు. గురువారం ఉదయం మండలంలోని అనంతపేట గ్రామంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం(కార్డన్‌సెర్చ్) నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు. అనంతరం సమావేశంలో సీఐ కృష్ణ మాట్లాడారు. సైబర్ నేరాలు, గంజాయి, రోడ్డు భద్రత గురించి వివరించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సైలు లింబాద్రి, శ్రీకాంత్, గణేశ్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండ



కడెం : సాయం అందిస్తున్న గ్రామస్తులు



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో..

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్యకార్మికుడు బండపెల్లి బుజ్జిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందా డు. గ్రామస్తులు పోగు చేసిన రూ.28 వేలు, 150 కిలోల బియ్యాన్ని గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడికి..

లక్ష్మణచాంద: గతంలో తమకు విద్యాబుద్ధులు చెప్పిన మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు రమణకు ఆయన శిష్యులు గురువారం రూ.33వేలను ఆర్థికసాయంగా అందించారు. రమణ అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం తెలిసి ఆయన శిష్యులు రమణ ఇంటికి వెళ్లి జమ చేసిన సొమ్మును అందించారు. కార్యక్రమంలో మధు, పవన్, ప్రశాంత్, దీపక్ తదితరులు ఉన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో రత్నకల్యాణి

సోన్: బీఎల్‌వోలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌ఓ (బూత్ లెవెల్ ఆఫీసర్)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిలో భాగంగా ఫారం–6,7, 8పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ జ్యోతి, ఏఎస్‌వో నిశిత, ఆర్‌ఐ జ్ఞానేశ్వర్, ఆల్‌మిన్, భీమ్‌సింగ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలు సాగు చేయాలి

ఖానాపూర్: రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తూ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ ఖానాపూర్ డివిజన్ అధికారి స్పందన కోరారు. గురువారం మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో మామిడి తోటను పరిశీలించారు. రైతులు కూరగాయలు, సుగంధద్రవ్యాలు, పూలు, పండ్ల తోటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ పంటలకు బిందు సేద్యం పరికరాలను కూడా రాయితీపై ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆమె వెంట క్లస్టర్ అధికారి దినేశ్ తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఉత్సవాలు ప్రారంభం



గోదావరి జలాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో పురాతన పోచమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మహిళలు గోదావరి జలాలను తీసుకొచ్చి ప్రతిమలకు అభిషేకం చేశారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో గొల్లెనతో పాల్గొన్నారు. అనంతరం బోనాలను ఆలయానికి తీసుకెళ్లగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాత్రి పోచమ్మ అమ్మవారి కథాకాలక్షేపం నిర్వహించారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



కడెం: ఆషాఢమాసం సందర్భంగా మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ప్రకృతి సిద్ధమైన గోరింటాకుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కొల్లూరి మమత, పాలకుర్తి వర్ష, సౌమ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.